

టన్ను చీనీ రూ.17 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.17 వేలు పలికాయి.



టమాట కిలో రూ.40

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.40, కనిష్టంగా రూ.15 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

35.2°/23.4°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో తుంపర్లు పడ్డాయి. గంటకు 10 నుంచి 18 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఈవీఎంల భద్రత పటిష్టంగా ఉండాలి



జేఎన్‌టీయూలో ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ఈవీఎంలు భద్రపరిచిన గోదాముల వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. జేఎన్‌టీయూ కళాశాలలోని స్ట్రాంగ్ రూములు, ఆర్‌డీఓ పాత కార్యాలయం ఆవరణలోని గోదాముల్లో భద్రపరిచిన ఈవీఎంలను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. కలెక్టర్ సమక్షంలో గోదాముల తలుపులను సిబ్బంది తెరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంలు భద్రపరిచిన గోదాముల వద్ద అత్యంత కట్టుదిట్టమైన భద్రత అమలు కావాలని, సీసీ కెమెరాల నిఘా నిరంతరం కొనసాగాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, ఎన్నికల డీటీ దివాకర్‌రావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

బుక్కరాయసముద్రం: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా విడిచిపెట్టేది లేదని ఎస్పీ మురళీకృష్ణ అన్నారు. బుధవారం రాత్రి మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. బీట్ సిస్టం మెరుగు పరుచుకోవాలన్నారు. సైబర్ క్రైం, డయల్-100, సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అంతా పరేషన్..!

రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక టీడీపీ కార్యకర్తలు ఆదాయ మార్గాలపై కన్నేశారు. గ్రామాల్లో అన్ని పోస్టులనూ బలవంతంగా లాక్కుంటున్నారు. ఇప్పటికే మధ్యాహ్న భోజనం కార్మికులను ఇంటికి పంపారు. ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులను లాక్కున్నారు. రేషన్ దుకాణ డీలర్ షిప్‌లకు తీవ్ర పోటీ నెలకొని ఎటూ తేలడం లేదు. దీంతో పలు చోట్ల ఇప్పటివరకూ రేషన్ సరుకులు గ్రామాలకు చేరడం లేదు. 'తమ్ముళ్ల' పంచాయితీతో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పేలా లేవు.





- డీలర్ షిప్ కుమ్ములాటల్లో 'తమ్ముళ్లు'
- పంచాయితీ తేలక బియ్యం బస్తాల రవాణాకు బ్రేక్
- ఆందోళనలో లబ్ధిదారులు

తాడిపత్రి రూరల్: సాధారణంగా ప్రతి నెలా 20వ తేదీ నుంచి 30లోపు తాడిపత్రి నియోజకవర్గంలోని గ్రామాలకు బియ్యం బస్తాలు రవాణా అయ్యేవి. కానీ ఈ నెల 25వ తేదీ వచ్చినా చాలా గ్రామాలకు ఇంత వరకూ రవాణా కాలేదు. ఆయా గ్రామాల్లో కొత్త డీలర్ల ఎంపిక ప్రక్రియ పూర్తి కాకపోవడంతో ఈ దుస్థితి దాపురించింది. కొత్త వారు వచ్చే వరకూ పాత డీలర్లకే బియ్యం బస్తాలను రవాణా చేయాలని రెవెన్యూ అధికారులు చెప్పినా, రైస్ గోడౌన్‌కు చెందిన కాంట్రాక్టర్‌తోపాటు అధికారి పాటించే సాహసం చేయడం లేదు. ఈ క్రమంలో తాడిపత్రి గోడౌన్‌లోనే 12,218 క్వింటాళ్ల బియ్యం బస్తాలు ఉండిపోయాయి. తాడిపత్రి పట్టణ, రూరల్ మండలంలో 45,615 కార్డులకు 7,500 క్వింటాళ్ల బియ్యం, పెద్దపప్పూరు మండలంలో 10,765 కార్డులకు 1,530 క్వింటాళ్లు, యల్లనూరు మండలంలో 11,059 కార్డులకు 1,543 క్వింటాళ్లు, పుట్లూరు మండలంలో 11,472 కార్డులకు 1,645 క్వింటాళ్ల చొప్పున బియ్యం రవాణా చేయాల్సి ఉంది.

మాకంటే మాకంటూ..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 'తమ్ముళ్ల' కన్ను డీలర్‌షిప్‌లపై పడింది. ఈ క్రమంలో వారిలో వారికే తీవ్ర పోటీ నెలకొంది. పెద్ద ఎత్తున నాయకులు, వారి అనుచరులు పోటీ పడుతున్నారు. తమకంటే తమకు కావాలంటూ పట్టుబడుతుండడంతో ఎటూ తేలడంలేదు. తాడిపత్రి నియోజకవర్గంతోపాటు శింగనమల నియోజవర్గంలోని పుట్లూరు, యల్లనూరు మండలాల్లో ఈ విషయం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. ఇప్పటికే ఆశావహులు పలువురు తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిని కలిసినట్లు తెలిసింది.

తిరుగుముఖం పట్టిన మేనేజర్

బియ్యం బస్తాలు రవాణా కాకుండా తాడిపత్రిలోనే నిలిచిపోయాయనే సమాచారం తెలుసుకున్న పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రామేశ్వరరెడ్డి బుధవారం అనంతపురం నుంచి తాడిపత్రికి వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గోడౌన్‌లో తిష్ట వేసి తహసీల్దార్లు, సీఎస్‌డీటీలతో మాట్లాడారు. అయితే తహసీల్దార్లు, సీఎస్‌డీటీలు ఒకరిపై మరొకరు చెప్పుకుని తప్పించుకోవడంతో చేసేదేమీ లేక మేనేజర్ తిరుగుముఖం పట్టారు. ఇదిలా ఉంటే, ఎన్నికల నేపథ్యంలో తాడిపత్రికి బదిలీపై వచ్చిన తహసీల్దార్ ఆంజనేయులు త్వరలో తన సొంత జిల్లా అయిన కర్నూలుకు వెళ్లనున్నారు. ఈ క్రమంలో డీలర్ల గొడవ తనకెందుకంటూ చేతులెత్తేసినటు తెలిసింది. బదిలీ ఆలస్యమైతే సెలవుపై వెళ్లడానికి కూడా సిద్ధమవుతున్నట్లు సమాచారం. దీంతో వచ్చే నెలలో రేషన్ ఇబ్బందులు తప్పేలా లేకపోవడంతో అందరిలో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఒకటో తేదీలోపు రవాణా చేస్తాం

కార్డుదారులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం కొన్ని మండలాలకు బియ్యం బస్తాల రవాణా జరుగుతోంది. తాడిపత్రి నియోజకవర్గంలోని గ్రామాలకు కూడా వచ్చే నెల ఒకటో తేదీలోపు రవాణా చేస్తాం. బియ్యం బస్తాల రవాణా ఎలా జరుగుతుందో తెలుసుకోవడానికే తాడిపత్రి బియ్యం గోడౌన్‌కు వచ్చా.

– రాజేశ్వరరెడ్డి, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల శాఖ, అనంతపురం

డీలర్‌షిప్ కోసం తన్నుకున్న 'తమ్ముళ్లు'

బుక్కరాయసముద్రం: డీలర్‌షిప్ కోసం 'తమ్ముళ్లు' తన్నుకున్న ఘటన మండలకేంద్రంలో జరిగింది. వివరాలు.. మండలంలోని గ్రామాల్లో కొన్ని రోజులుగా డీలర్‌షిప్ పంచాయితీలు నడుస్తున్నాయి. డీలర్‌షిప్‌లు తమకంటే తమకు కావాలంటూ ఎమ్మెల్యే బండారు శ్రావణి వర్గీయులు, ద్విసభ్య కమిటీ సభ్యులైన ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి వర్గీయులు పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే శ్రావణి కార్యాలయం నుంచి బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి కొత్త డీలర్లుగా వీరిని నియమించాలంటూ ఓ జాబితా పంపారు. విషయం తెలుసుకున్న ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి వర్గీయులు అక్కడికి చేరుకుని తమ పేర్లు లేవంటూ ఆందోళనకు దిగారు. ఈ క్రమంలోనే ఇరు వర్గాల మధ్య మాటామాటా పెరిగింది. దండువారిపల్లికి చెందిన టీడీపీ మాజీ మండల కన్వీనర్ ఆదినారాయణను ఓ వర్గానికి చెందిన నాయకులు కిందపడేసి కొట్టారు. కొంత సేపటికే అందరూ పోలీసుస్టేషన్‌కు చేరుకుని పంచాయితీ పెట్టారు. కేసులు పెట్టుకోకుండా ఇరువర్గాల వారు కలసి మాట్లాడుకుని కొత్తగా డీలర్లను ఎంపిక చేసుకుందామంటూ అక్కడి నుంచి వెనుదిరిగారు.



బుక్కరాయసముద్రం పోలీస్ స్టేషన్ ఎదుట గుమిగూడిన టీడీపీ కార్యకర్తలు

ఆగస్టు మొదటి వారం వరకూ వేరుశనగ విత్తుకు అదను

- డీఏఓ ఉమామహేశ్వరమ్మ



మాట్లాడుతున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

కణేకల్లు: వర్షాలు అనుకూలిస్తే ఆగస్టు మొదటి వారం వరకూ వేరుశనగ విత్తనం వేసుకోవచ్చని డీఏఓ ఉమామహేశ్వరమ్మ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాలకు చెందిన ఎంపీఈఓ, వీఏఏస్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు అరకొరగానే పడ్డాయన్నారు. దీంతో చాలా మంది రైతులు వేరుశనగ పంట వేసుకోలేదన్నారు. ఆగస్టు మొదటి వారంలోపు వర్షాలు కురవకపోతే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. పెట్టుబడి ఖర్చులు పెరగకుండా భూసార పరీక్షల ఫలితాలను ఆధారం చేసుకొని ఎరువులు వాడేలా రైతుల్లో చైతన్యం కల్గించాలన్నారు. ప్రతి రైతు సేవా కేంద్రం వద్ద తప్పని సరిగా మొక్కలను నాటాలన్నారు. గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలివ్వాలని ఆదేశించారు. కౌలు రైతులను గుర్తించి సీసీఆర్‌సీలు ఇవ్వాలన్నారు. అనంతరం కణేకల్లు వ్యవసాయ విత్తనోత్పత్తి క్షేత్రం కార్యాలయాన్ని డీఏఓ సందర్శించారు. నారు మడిని పరిశీలించారు. ఎస్‌ఎస్‌ఎంఎఫ్ ఫారంలో 65.5 ఎకరాలతోపాటు పీడీడీఎఫ్ వద్ద 67.5 ఎకరాల్లో వరి సాగు కోసం 3.5 ఎకరాల్లో నారు పోసినట్లు ఫాం ఏడీఏ నారాయణనాయక్ డీఏఓ దృష్టికి తెచ్చారు. సకాలంలో వరినారు వేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్, బొమ్మనహాళ్ ఏఓ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారామెడికల్ కోర్సులకు దరఖాస్తులు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాలలో వివిధ పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాణిక్య రావు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. డీఎంఎల్‌టీ, డీఓఏ, డీఏఎన్‌ఎస్, డీఎంఐటీ, డీఈసీజీ, డీఆర్‌జీఏ, డీడీఆర్‌ఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆగస్టు 6లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. www.apsahpc.co.in, http://dme.ap. nic.in వెబ్‌సైట్‌లో అన్ని వివరాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

జిల్లాలో జేసీ అలజడి





ఎస్పీ కార్యాలయం వద్ద అనుచరులతో జేసీ ప్రభాకర్‌రెడ్డి, బయట హల్‌చల్ చేస్తున్న అనుచరులు

- రోజూ ఏదో ఒక వివాదంతో భయభ్రాంతులకు గురిచేస్తున్న ప్రభాకర్‌రెడ్డి
- కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మరింతగా రెచ్చిపోతున్న వైనం
- పోలీసులు, ఆర్టీఏ అధికారులు.. ఇలా అందరిపైనా చిందులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: టీడీపీ నేత, తాడిపత్రి మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆగడాలు రోజు రోజుకూ పెచ్చుమీరుతున్నట్టు ప్రజల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. మరీ ముఖ్యంగా కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆయన వ్యాఖ్యలకు, చేష్టలకు అడ్డూ అదుపూ లేకుండా పోతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గడిచిన ఐదేళ్లూ ప్రశాంతంగా ఉన్న తాడిపత్రి... కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నిత్యం గొడవలతో అట్టుడుకుతోంది. జేసీ ప్రభాకర్‌రెడ్డి కేవలం తాడిపత్రి మునిసిపల్ చైర్మన్ మాత్రమే. కానీ తనయుడు జేసీ అస్మిత్‌రెడ్డి ఎమ్మెల్యే కావడంతో తానే ఎమ్మెల్యే అన్నట్టు అధికారులను, పోలీసులను ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు. తాడిపత్రిలో జేసీ ప్రభాకర్‌రెడ్డి వల్ల ఎప్పుడు ఏం జరుగుతుందో అర్థం కావడం లేదని పలువురు సామాన్యులు, వ్యాపారస్తులు బిక్కుబిక్కుమంటున్నారు.

అధికారులకు బెదిరింపులు

బీఎస్3 వాహనాలను స్క్రాప్ కింద కొని వాటిని బీఎస్4గా మార్చి అమ్మిన కేసులో జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రధాన నిందితుడు. వీటిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన కేసులో సీబీఐ, ఈడీ సంస్థలే నిర్ధారించాయి. అప్పట్లో జటాధర ఇండస్ట్రీస్ యజమాని చవ్వా గోపాల్‌రెడ్డి, జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇళ్లలో సోదాలు కూడా నిర్వహించారు. తాజాగా కూటమి ప్రభుత్వం వచ్చాక సీబీఐ, ఈడీలను వదిలేసి.. గతంలో ఇక్కడ కేసులు పెట్టిన అధికారులపై జేసీ ప్రభాకర్‌రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. 'మీ అంతు చూస్తా' అంటూ రవాణాశాఖ అధికారులను బెదిరిస్తున్నారు. సీజ్ చేసిన వాహనాలను రిపేర్ చేసి ఇవ్వాలని, లేదంటే అంతు చూస్తానంటూ వార్నింగ్ ఇచ్చారు. దీంతో అధికారులు ఇక్కడ పనిచేయాలంటేనే భయపడుతున్నారు.

బెయిల్‌పై ఉన్నా ఇష్టారాజ్యం

ఎన్నికల సమయంలో తాడిపత్రిలో అల్లర్లకు సంబంధించిన కేసులో జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఆయన తనయుడు అస్మిత్ రెడ్డి నిందితులుగా ఉన్నారు. బెయిల్ ఇచ్చేవరకూ తాడిపత్రికి రావద్దంటూ కోర్టు ఆంక్షలు విధించింది. బెయిల్ రాక మునుపే తన సోదరి మృతిచెందడంతో కర్మకాండలకు వచ్చానని చెప్పారు. ఆ తర్వాత ఈ నెల 20న బెయిల్ వచ్చాక కూడా ఎలాంటి ష్యూరిటీలు ఇవ్వకుండానే తాడిపత్రిలో ఉన్నారు. తాను ష్యూరిటీలు ఇవ్వబోనని, పోలీసులు ఏం చేసుకుంటారో చేసుకోండంటూ సవాల్ విసిరారు. కోర్టు ఆంక్షలను ధిక్కరించి ఇలా ప్రవర్తిస్తున్నప్పటికీ ప్రభాకర్‌రెడ్డిపై పోలీసులు చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశమైంది. మరోవైపు ఇదే కేసులో బెయిలు వచ్చిన వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ష్యూరిటీలు ఇస్తానని, తాడిపత్రికి వస్తానన్నా ఆయన్ను రానివ్వలేదు. దీన్నిబట్టి ప్రభాకర్‌రెడ్డి అంటే పోలీసులు ఎంతగా భయపడుతున్నారో తెలుస్తోంది.

వందలాది వాహనాలతో హల్‌చల్

తన వాహనాల సీజ్‌కు వ్యతిరేకంగా బుధవారం అనంతపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా అంటూ జేసీ ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రి నుంచి వందలాది వాహనాలతో అనంతపురం వచ్చి హల్‌చల్ చేశారు. భారీగా వాహనాలు రావడం వల్ల ట్రాఫిక్ అంతరాయంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనంతపురంలోని పాతూరు మొత్తం ట్రాఫిక్‌తో స్తంభించింది. అనంతరం అదే మందీమార్బలంతో ఎస్పీ ఆఫీసుకు వెళ్లారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి తీరుతో తాడిపత్రి పోలీసులకు నిత్యం నరకంగా ఉంది. మరోవైపు రెవెన్యూ అధికారులు సైతం ఆ నియోజకవర్గంలో పనిచేయాలంటే భయపడుతున్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి వివాదాలకు కేంద్రబిందువుగా ఉన్నప్పటికీ పోలీసులు కనీస చర్యలు తీసుకోకవడం లేదు. ప్రస్తుతం తాడిపత్రిలో జేసీ రెచ్చగొట్టే వ్యాఖ్యలతో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

నురగలు కక్కుతూ.. నదికి పారుతూ



తుంగభద్ర జలాశయం గేట్ల ద్వారా నదికి పోతున్న నీరు

బొమ్మనహాళ్: కర్ణాటకలోని తుంగభద్ర జలాశయానికి భారీగా వరద కొనసాగుతుండడంతో టీబీ బోర్డు అధికారులు 10 క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని నదికి వదులుతున్నారు. డ్యాం ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా రిజర్వాయర్‌కు పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో డ్యాం క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని నదికి వదులుతున్నారు. ఇప్పటికే హెచ్చెల్సీకి నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రస్తుతం హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105వ కిలోమీటర్ వద్ద 500 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

'మిషన్ వాత్సల్య' పక్కాగా అమలవ్వాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: పేద, నిస్సహాయ కుటుంబాల పిల్లల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ వాత్సల్య పథకం పక్కాగా అమలు కావాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు అర్హులను ఎంపిక చేయాలన్నారు. తల్లి వితంతువు లేదా విడాకులు తీసుకున్న లేదా కుటుంబం విడిచిపెట్టి వెళ్లిన వారి పిల్లలకు, పేద కుటుంబంలో నివసిస్తున్న పిల్లలు, అనాథలుగా ఉన్నవారికి పథకం వర్తిస్తుందన్నారు. ప్రాణాంతక వ్యాధికి గురైన వారికి, తల్లిదండ్రులు అసమర్థులు లేదా పిల్లలను ఆర్థికంగా, శారీరకంగా చూసుకోలేని వారు, భౌతికంగా దూరమైన వారు కూడా అర్హులన్నారు. ప్రకృతి వైపరీత్యాలకు గురైనవారు, బాల కార్మికులు, బాల్యవివాహ బాధితులు, పిల్లల అక్రమ రవాణా, హెచ్ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగులు, తప్పిపోయిన లేదా పారిపోయిన పిల్లలు, బాల యాచకులు లేదా వీధిలో నివసిస్తున్న, హింసకు గురైన, దోపిడీకి గురైన పిల్లలు, మద్దతు, పునరావాసం అవసరమైన వారు, పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్ స్కీమ్ కింద చేర్చిన పిల్లలనూ గుర్తించాలని చెప్పారు. ఎంపికైన ఒక్కో చిన్నారికి ప్రతి నెలా రూ.4 వేలు అందిస్తారన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, సీడబ్ల్యూసీ ఈఓ మేడా రామలక్ష్మి, సిబ్బంది చంద్రకళ, దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

జలశక్తి అభియాన్ పనులు వేగవంతం చేయండి

అనంతపురం టౌన్: జలశక్తి అభియాన్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక డ్వామా కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులకు సంబంధించి వెంటనే జీఐఎస్ ట్యాగింగ్ చేయాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో జిల్లాను అగ్రగామిగా నిలపాలన్నారు. చెరువుల్లో పూడిక తీత పనులు చేపట్టి వర్షపు నీటిని ఒడిసి పట్టాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, సీఈలు ప్రతాప్, సతీష్, ఏఓ విజయలక్ష్మి, ఏపీడీలు, ఏపీఓలు పాల్గొన్నారు.

పురాతన కట్టడాల్ని పరిరక్షించాలి

అనంతపురం అర్బన్: 'పురాతన కట్టడాలు మన సంస్కృతికి చిహ్నాలు. వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది' అని కలెక్టర్ వి.వినోద్ కుమార్ అన్నారు. స్థానిక టవర్‌క్లాక్ సమీపంలోని పాత ఆర్‌డీఓ కార్యాలయ భవనాన్ని కలెక్టర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత ఆర్‌డీఓ కార్యాలయాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పురాతన భవనాలను పరిరక్షించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దారు శివరామిరెడ్డి, సర్వేయర్ ప్రతాపరెడ్డి, ఆర్ఐ సందీప్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అరాచకాలపై గర్జించిన 'అనంత' నేతలు







వేదిక వద్ద జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్, మాజీ ఎంపీ రంగయ్య, మాజీ ఎమ్మెల్యేలు అనంత, ప్రకాష్ రెడ్డి, పెద్దారెడ్డి, శంకరనారాయణ, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, నేతలు ఆలూరి, ఉమా

అనంతపురం కార్పొరేషన్: టీడీపీ అరాచక పాలనను వైఎస్సార్ సీపీ నేతలు ఎండగట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఢిల్లీలో బుధవారం చేపట్టిన నిరసన కార్యక్రమానికి నేతలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా హస్తినలో చంద్రబాబు దుష్ట పాలనపై నిప్పులు చెరిగారు. ప్రజాస్వామ్యంలో ప్రతీకారాలకు, హింసకు తావు లేదన్నారు. రాజ్యాంగ విలువల్ని హరిస్తూ కూటమి ప్రభుత్వం హత్యా రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే ప్రజలు బెంబేలెత్తిపోయేలా వ్యవహరిస్తున్నారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. నేడు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, మాలగుండ్ల శంకర నారాయణ, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, పెద్దారెడ్డి, మాజీ ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ముఖ్య నేతలు ఆలూరి సాంబశివారెడ్డి, మెట్టు గోవింద రెడ్డి, ఈరలక్కప్ప, మక్బూల్, దీపిక, హరీష్‌యాదవ్, ఉమా మహేశ్వర నాయుడు, మహాలక్ష్మి శ్రీనివాస్, అనంతపురం మేయర్ వసీం, గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతి రెడ్డి, కార్పొరేటర్లు సాకే చంద్ర, సైఫుల్లాబేగ్, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, నాయకులు జానీ, వేమల నదీం, ఫయాజ్, నార్పల సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య


మృతురాలు స్వాతి

కూడేరు: మండలంలోని కలగళ్లకు చెందిన ఎర్రిస్వామి భార్య స్వాతి(32) ఆత్మహత్య చేసుకుంది. వ్యవసాయంతో జీవనం సాగిస్తున్న వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అప్పులు చేసి పంటల సాగు చేపట్టారు. అయితే వర్షాభావ పరిస్థితుల్లో పంటల దిగుబడి లేక నష్టపోయారు. దీంతో అప్పుల భారం పెరిగింది. దీంతో అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదంటూ బాధపడుతున్న భర్తను చూసి మనస్తాపం చెందిన ఆమె మంగళవారం ఊజీ మాత్రలు మింగింది. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో అదే రోజు రాత్రి ఆమె మృతి చెందింది. ఘటనపై కూడేరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఈ–క్రాప్‌పై నీలినీడలు

- పంట నమోదుపై ఇంకా ప్రకటన చేయని చంద్రబాబు సర్కార్
- గత ప్రభుత్వంలో అత్యంత పారదర్శకంగా పంట నమోదు
- ఈ–క్రాప్ ప్రామాణికంగా రైతులకు విరివిగా ప్రయోజనాలు
- ఇన్‌పుట్, ఇన్సూరెన్స్, ఎంఎస్‌పీ, సున్నావడ్డీ తదితర ఫలాలు


గత ఖరీఫ్‌లో రైతు సాగు చేసిన వేరుశనగ పంటను ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు (ఫైల్)

అనంతపురం అగ్రికల్చర్: కులమతాలు, పార్టీలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి రైతుకూ ఎంతో ప్రయోజనకారిగా ఉన్న ఈ–క్రాప్ (పంట నమోదు) వ్యవస్థపై నీలినీడలు కమ్ముకున్నాయి. నెలన్నర కిందట ఏర్పాటైన చంద్రబాబు సర్కార్ దీనిపై ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇప్పటికే ఖరీఫ్ ఆరంభమై రెండు నెలలు కావస్తోంది. అరకొర వర్షాలకు మందకొడిగా ఏరువాక కొనసాగుతోంది. 80 వేల హెక్టార్ల వరకు పంటలు వేశారు. సాగు చేసిన అన్ని రకాల వ్యవసాయ, ఉద్యాన పంటల వివరాలు ఈ–క్రాప్ కింద ఆన్‌లైన్ చేయాల్సివుంది. సాగు చేసిన ప్రతి పంట పొలాలను ఈ–క్రాప్ బుకింగ్ చేయడంతో పాటు సదరు రైతుల బయోమెట్రిక్‌తో ఈకేవైసీ చేయాల్సివుంది. ఏటా జూలై రెండో పక్షం నుంచి ప్రత్యేక యాప్ ద్వారా మొదలు పెట్టి సెప్టెంబర్ ఆఖరు వరకు కొనసాగిస్తూ వచ్చారు. పారదర్శకంగా ఉండటంతో రైతులు కూడా పంట నమోదుకు బాగా అలవాటుపడ్డారు. అయితే వ్యవసాయశాఖ ఇప్పటి వరకూ పంట నమోదు ప్రక్రియ చేపట్టక పోవడంతో ఈ–క్రాప్ బుకింగ్, ఈకేవైసీపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ–క్రాప్ లేకపోతే పంటల వారీగా ఖచ్చితమైన సాగు విస్తీర్ణం, వాటికి అనుగుణంగా విత్తన ప్రణాళికలు, పంటల వైవిధ్యం, పథక నిర్దేశన చేయడం కూడా కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రశంసలు అందుకున్న ఈ–క్రాప్

గత ఐదేళ్ల అధికారంలో ఉన్న జగన్ సర్కార్... దేశంలో మరెక్కడా లేని విధంగా వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. గ్రామ గ్రామాన ఆర్‌బీకే వ్యవస్థ ఏర్పాటు చేసిన అదే వేదికగా గ్రామం దాటి వెళ్లే అవసరం లేకుండా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, ఇతరత్రా ఇన్‌పుట్స్ అందించేలా చర్యలు తీసుకుంది. అలాగే సాగు చేసిన పంటలను ఈ–క్రాప్ బుకింగ్ చేపట్టి దాని ఆధారంగా రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహక రాయితీలు, పథకాలు వర్తింపజేసింది. దీంతో అర్హత కలిగిన ప్రతి రైతూ ప్రయోజనం పొందారు. ఈ కార్యక్రమం అత్యంత పారదర్శకంగా చేపట్టడంతో దేశంలో పలు రాష్ట్రాలు సైతం ఈ–క్రాప్ వ్యవస్థను మెచ్చుకున్నాయి.

నాడు రూ.కోట్లలో లబ్ధి

ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోతే ఈ–క్రాప్ ఆధారంగా ఉమ్మడి జిల్లాలో అర్హత కలిగిన రైతులకు రూ.485 కోట్ల మేర పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్‌సబ్సిడీ)ని అప్పట్లో జగన్ సర్కార్ అందజేస్తూ వచ్చింది. ఉచిత పంటల బీమా పథకంతో గుర్తించిన పంటలు సాగు చేసిన రైతులకు బీమా పరిహారం కింద అత్యధికంగా రూ.1,883 కోట్ల పరిహారం అందించారు. పండించిన పంటలకు బహిరంగ మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకపోతే కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)తో నోడల్ ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేశారు. ఈ లెక్కన రూ.280 కోట్లు విలువ కలిగిన వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేసి రైతులకు లబ్ధి చేకూర్చారు. అలాగే బ్యాంకుల ద్వారా రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతులకు ఈ–క్రాప్ ఆధారంగా పంట రుణాల సున్నా వడ్డీ పథకం కింద రూ.156 కోట్ల మేర వడ్డీ జమ చేశారు. ఖరీఫ్, రబీలో విత్తన పంపిణీకి వీలుగా రైతుల నుంచి గిట్టుబాటు ధరతో విత్తన సేకరణ చేశారు. ఇలా గత ప్రభుత్వం అమలు చేసిన పలు పథకాలకు ఈ–క్రాప్‌నే ప్రామాణికం కావడం గమనార్హం. ఇంతటి మహత్తర కార్యక్రమాన్ని కొనసాగించాల్సిన చంద్రబాబు సర్కార్ ఇంకా ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

రాష్ట్రంలో అమ్మాయిలకు రక్షణ కరువు


ఎస్ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

గుంతకల్లుటౌన్: రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆడపిల్లలు, మహిళలకు రక్షణ కరువైందని, వారిపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఎస్ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ ధ్వజమెత్తారు. విద్యార్థినులపై దాడులు అరికట్టాలని, నిర్భయ చట్టాన్ని అమలు చేయాలంటూ వివిధ కళాశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థినులు బుధవారం గుంతకల్లులో భారీ ర్యాలీ చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ నుంచి గాంధీచౌక్ వరకూ ర్యాలీ కొనసాగింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఈ 50 రోజుల్లోనే చిన్నారులు, మహిళలపై అనేక అఘాయిత్యాలు చోటు చేసుకున్నాయని ఈ సందర్భంగా వక్తలు మండిపడ్డారు. ముచ్చుమర్రిలో అదృశ్యమైన బాలిక ఆచూకీని కనుక్కోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. విద్యార్థినులు, మహిళల రక్షణకు నిర్భయ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని, లేకుంటే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌ఐ జిల్లా బాలిక విభాగం కన్వీనర్ రజిత, పవిత్ర, స్థానిక నాయకులు వెంకటేష్, శివ, సోము, గణేష్, కిషోర్ పాల్గొన్నారు.

కణేకల్లు ఏపీఎంఎస్ ప్రిన్సిపాల్ సస్పెన్షన్

సాక్షి ఎఫెక్ట్..

కణేకల్లు: రోజులు తరబడి విధులకు దుమ్మా కొడుతున్న కణేకల్లు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆదినారాయణపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ విద్యాసంవత్సరం ఆరంభం నుంచి ఇప్పటి వరకూ ఆయన విధులకు హాజరు కాకపోవడంపై 'అయ్యవారూ... మీ జాడెక్కడ?' శీర్షికన ఈ నెల 16న 'సాక్షి'లో వెలువడిన కథనంపై ఆర్జేడీ శామ్యూల్ స్పందించారు. విచారణ అనంతరం ఆదినారాయణను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ మోడల్ స్కూల్ జిల్లా ఏడీ నాగరాజు స్పష్టం చేశారు. పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా బసవరాజును నియమించారు.

ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యలు పరిష్కరించండి

- ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు


జెడ్పీ సీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు అన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం జిల్లా పరిషత్ సీఈఓ ప్రభాకరరావుకు ఫెడరేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. ఖాతాల్లో నెలవారీగా ఎంత నగదు, ఎంత వడ్డీ జమ అయిందో వివరాలు తెలియక ఉపాధ్యాయులు ఆందోళనలో ఉన్నారన్నారు. పార్ట్ ఫైనల్ రుణాలు, ఇతర రుణాల కోసం నెలల తరబడి వేలాది మంది ఉపాధ్యాయులు జెడ్పీ చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇతర జిల్లాల్లో వార్షిక ఖాతా నిలువలను విడుదల చేసినా ఒక్క అనంతపురం జిల్లాలో మాత్రమే వార్షిక ఖాతా నిలువలను విడుదల చేయకుండా ఖాతాలను స్తంభింప చేయడం బాధాకరమన్నారు. పీఎఫ్ సెక్షన్ ఖాతా నిలువ నవీకరణ సమాచారం తక్షణమే విడుదల చేయాలన్నారు. సీఈఓను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాయల వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్, ఉపాధ్యక్షుడు సతీష్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సర్దార్ వలి, సీనియర్ నాయకులు కె.పాతిరెడ్డి, ఎం. కిష్టప్ప, రామాంజనేయులు, తిప్పేస్వామి ఉన్నారు.

రైతులను నిరాశపర్చిన బడ్జెట్

- రుణమాఫీ, మద్దతు ధరల గ్యారెంటీ చట్టం ప్రతిపాదన లేదు
- రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి


మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం అర్బన్: బడ్జెట్‌లో వ్యవసాయానికి అరకొర నిధులు కేటాయించి రైతులను కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిరాశకు గురిచేసిందని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి మండిపడ్డారు. వ్యవసాయ రుణాలమాఫీ, మద్దతు ధరల గ్యారెంట్ చట్టం ప్రస్తావన లేకపోవడం శోచనీయమన్నారు. ఆ సంఘం జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్ ప్రవేశపెట్టిన రూ.48 లక్షల కోట్ల బడ్జెట్‌లో వ్యవసాయం దాని అనుబంధ రంగాలకు కేవలం రూ.1.52లక్షల కోట్లు మాత్రమే కేటాయించడం అన్యాయమన్నారు. దేశంలో 60 శాతానికి పైగా ప్రజలు వ్యవసాయంపై ఆధారపడ్డారన్నారు. ఇలాంటి రంగానికి బడ్జెట్‌లో కనీసంగా 10 శాతం నిధులు కేటాయించాలన్నారు. విదేశీ కార్పొరేట్ కంపెనీలకు పన్ను రాయితీలు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం డ్రిప్, స్ప్రింకర్లపై జీఎస్టీ రద్దుపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఫసల్ బీమా పథకానికి గత ఏడాది కంటే రూ.400 కోట్లు తగ్గించారన్నారు. ఎరువుల సబ్సిడీకి గత ఆర్థిక సంవత్సరంలో రూ. 1.88 లక్షల కోట్లు కేటాయిస్తే ప్రస్తుతం రూ.1.64 కోట్లు కేటాయించాన్నారు. దీనివల్ల ఎరువుల ధరల పెరిగే ప్రమాదం ఉందన్నారు. నూనెగింజలు, పప్పుధాన్యాలు ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధిస్తామని చెబుతూనే విదేశీ దిగుమతులపై సుంకాలను పూర్తిగా ఎత్తివేయడం దేశీయ వ్యవసాయాన్ని దెబ్బతీసేందుకేనని అర్థమవుతోందన్నారు. బడ్జెట్‌లో కౌలు రైతులను పూర్తిగా విస్మరించారన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టోయిన రైతులను ఆదుకునేందుకు నిధుల కేటాయింపులు లేవన్నారు. మొత్తానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులను పూర్తిగా నిరాశపరిచిందన్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందాలి


మాట్లాడుతున్న డీఐఓ డాక్టర్ యుగంధర్

రాప్తాడు: గ్రామీణులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య ఆరోగ్య సిబ్బందిని డీఐఓ యుగంధర్ ఆదేశించారు. రాప్తాడులోని పీహెచ్‌సీని బుధవారం ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులు, ల్యాబ్, మందుల నిల్వలు పరిశీలించారు. కుటుంబ నియంత్రణకు సంబంధించిన రికార్డుల తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. 24 గంటలూ రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. సోమవారం మినహా ప్రతి రోజూ మెడికల్ ఆఫీసర్లు క్యాంపులకు వెళ్లాల్సిందేనన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే క్రమ శిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఎన్ఎంలు హెడ్‌క్వార్టర్‌లో ఉండటం లేదని ఫిర్యాదులు వస్తే వారిని సస్పెండ్ చేస్తామన్నారు. దోమల నియంత్రణ చర్యలపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేను పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బొమ్మేపర్తిలోని సచివాలయంలో చేపట్టిన ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించి, అందుతున్న వైద్య సేవలపై గ్రామస్తులతో ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యాధికారి శివకృష్ణ, సీహెచ్ఓ శివప్రసాద్, ఫార్మసిస్ట్ మూర్తి, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్‌బాబు, సూపర్ వైజర్ అరుణ, ఎంఎల్‌హెచ్‌పీ మీన, ఏఎస్ఎం శ్రీలత పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మొండిచెయ్యి


మాట్లాడుతున్న దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఏడీఎస్ నారాయణ

గుత్తి: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమంపై ఎలాంటి ప్రస్తావన లేదని దక్షిణ మధ్యరైల్వే మజ్దూర్ యూనియన్ ఏడీఎస్ నారాయణ, బ్రాంచ్ సెక్రెటరీ రామాంజులరెడ్డి ధ్వజమెత్తారు. గుత్తి రైల్వే డీజిల్‌షెడ్‌లో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఓపీఎస్, 8వ వేతన సంఘం ఏర్పాటు, ఇన్‌కమ్ టాక్స్ స్లాబ్ పెంచడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకపోవడం బాధాకరమన్నారు. బడ్జెట్ అంశాన్ని పక్కన పెట్టి ఓపీఎస్ అమలు, 8వ వేతన సంఘం ఏర్పాటుపై వెంటనే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే పోరుబాట పడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ నాయకులు రాజేంద్రప్రసాదరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

బోరు బావి ధ్వంసం


పైపులు పగులగొట్టిన దృశ్యం

రాప్తాడు: మండలంలోని బుక్కచెర్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ఎద్దుల ప్రకాష్‌రెడ్డికి చెందిన వ్యవసాయ తోటలోని బోరు బావిని దుండగులు ధ్వంసం చేశారు. బాధితుడు తెలిపిన మేరకు... గ్రామ సమీపంలోని వీరాలమ్మ గుడి వద్ద ప్రకాష్‌రెడ్డికి 8 ఎకరాల పొలం ఉంది. ఇందులో 4 ఎకరాల్లో 600 చీనీ చెట్లు, మరో 4 ఎకరాల్లో టమాట పంట సాగు చేపట్టాడు. గ్రామంలో వైఎస్సార్‌సీపీకి చురుకైన కార్యకర్తగా ఉంటున్న ఆయనపై స్థానిక టీడీపీ నేతలు కక్ష కట్టారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తోట వద్ద కాపలా ఎవరూ లేరన్న విషయం తెలుసుకున్న దుండగులు బోరు బావిని ధ్వంసం చేశారు. పైప్ లైన్‌ను పగులగొట్టారు. దీంతో దాదాపు రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

ప్రయాణికుల సౌకర్యాలు, భద్రతకు పెద్దపీట : డీఆర్‌ఎం



రైల్వే మంత్రి వీసీలో పాల్గొన్న డీఆర్‌ఎం, ఏడీఆర్‌ఎం

గుంతకల్లు: రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పన, భద్రతకు ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేసినట్లు తెలుస్తోందని డీఆర్‌ఎం విజయ్‌కుమార్ పేర్కొన్నారు. 2024–25 రైల్వే బడ్జెట్‌పై కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం న్యూఢిల్లీలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. గుంతకల్లు డీఆర్‌ఎం కార్యాలయం నుంచి డీఆర్‌ఎం విజయ్‌కుమార్, ఏడీఆర్‌ఎం సుధాకర్, సీనియర్ డీసీఎం మనోజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ... ఈ ఏడాది బడ్జెట్‌లో డివిజన్‌కు ఆశించిన స్థాయిలోనే నిధులు, కొత్త ప్రాజెక్టులు మంజూరు అయ్యే అవకాశం ఉందన్నారు. నేడో, రేపో విడుదల చేసే పింక్‌బుక్‌లో గుంతకల్లు డివిజన్‌కు ఎంత మొత్తం నిధులు విడుదలయ్యేంది తెలుస్తుందన్నారు.

చెట్లను పెంచడం సామాజిక బాధ్యత

- కలెక్టర్ వినోద్‌కుమార్ సూచన


నాటిన మొక్కలను పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: చెట్లను పెంచడం సామాజిక బాధ్యతగా అందరూ గుర్తించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. హరిత అనంతలో భాగంగా బుధవారం కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అధికారులు, సిబ్బందితో కలసి కలెక్టర్ మొక్కలు నాటి, నీరు పోశారు. అనంతరం 'మొక్కలకు నీరు పోస్తాం, అవి మహా వృక్షాలు అయ్యే వరకూ కాపాడుతాం' అని ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. మొక్క నాటిన ప్రతి ఉద్యోగి దానికి ప్రతి రోజూ తప్పనిసరిగా నీరు పోస్తూ తీసిన ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఎవరి మొక్కకు వారే బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, డీఎస్‌ఓ శోభారాణి, ఖజానా శాఖ డీడీ సరళ విజయకుమారి, డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, నగర పాలక సంస్థ ఉద్యాన ఏడీ లక్ష్మీప్రసన్న, కలెక్టరేట్ అధికారులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వివాహిత గొంతు కోసిన దుండగులు

కంబదూరు: మండలంలోని మర్రిమాకులపల్లికి చెందని వివాహిత భానుప్రియపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి, బ్లేడుతో గొంతు కోశారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు... మర్రిమాకులపల్లికి చెందిన సుధాకర్... శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు ప్రాంతానికి చెందిన భానుప్రియను ప్రేమించి, ఏడాది క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడు. భానుప్రియకు తల్లిదండ్రులిద్దరూ లేరు. దీంతో పిన్నమ్మనే పెంచి పెద్ద చేసింది. అయితే సుధాకర్‌ను పెళ్లి చేసుకున్నప్పటి నుంచి ఆమెను గుర్తు తెలియని వ్యక్తులు బెదిరిస్తూ వచ్చారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఒంటరిగా ఉన్న భానుప్రియపై మాస్కులు ధరించిన వ్యక్తులు దాడి చేశారు. బ్లేడ్‌తో గొంతు కోసి పరారయ్యారు. గమనించిన చుట్టుపక్కల వారు ఆమెను వెంటనే కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

తాగునీటి కోసం రాస్తారోకో


అధికారులను నిలదీస్తున్న మహిళలు

విడపనకల్లు: తాగునీటి కోసం విడపనకల్లు వాసులు బుధవారం 42వ జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. సీపీఐ నాయకుడు చెంగ్రాయుడు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో రసూలమ్మ, సుబ్బలక్ష్మి, మాలగేరి, కురుబగేరి కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విషయం తెలుసుకున్న అధికారులు ఆందోళనను విరమించాలని కోరారు. అయినా ఆందోళనకారులు వినలేదు. రెండు నెలలుగా తాగునీరు సరఫరా చేయకుండా తమను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మీ ఇళ్లలోనూ తాగునీరు లేకపోతే ఇలాగే ఊరుకుంటారా? అని అధికారులను నిలదీశారు. తాగునీరు సరఫరా చేసే వరకూ ఆందోళనను విరమించబోమని భీష్మించారు. దీంతో అధికారులు వెంటనే తాగునీటిని సరఫరా చేస్తామని భరోసానివ్వడంతో ఆందోళనను విరమించారు.

కుష్టు అనుమానిత కేసులను గుర్తించండి : డీఎంహెచ్‌ఓ

గార్లదిన్నె: కుష్టువ్యాధిపై గ్రామీణులకు అవగాహన కల్పించి అనుమానిత కేసులను వెంటనే గుర్తించాలని వైద్య ఆరోగ్య సిబ్బందిని డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి ఆదేశించారు. బుధవారం గార్లదిన్నె పీహెచ్‌సీని ఆమె తనిఖీ చేశారు. పలు రికార్డులు, ఆస్పత్రి పరిసరాలు, వార్డుల్లో శుభ్రతను పరిశీలించారు. డయేరియా, కుష్టు వ్యాధి సర్వేపై వివరాలు ఆరా తీశారు. కార్యక్రమంలో డాక్టర్ గౌతమి, దిలీప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదంలో యువకుడి మృతి

అనంతపురం: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం శివారులోని రాజీవ్ కాలనీకి చెందిన వినోద్‌కుమార్ (34) బుధవారం వేకువజాము 2 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై వెళుతూ సైపుల్లా బ్రిడ్జి వద్ద అదుపు తప్పి కిందపడ్డాడు. అటుగా వెళుతున్న వారు గమనించి వెంటనే క్షతగాత్రుడిని ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే వినోద్ కుమార్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రైలు కిందకు దూరి గాయపడిన మహిళ

గార్లదిన్నె: ప్రమాదవశాత్తు రైలు కిందకు దూరి ఓ మహిళ గాయపడింది. వివరాలు... గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామానికి చెందిన నల్లమ్మ బుధవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న గూడ్స్ కింద నుంచి అవతలి వైపునకు చేరుకునేందుకు ప్రయత్నించింది. అదే సమయంలో గూడ్స్ ముందుకు కదలడంతో ప్లాట్‌ఫాంపై ఉన్న వారు గట్టిగా కేకలు వేయడంతో లోకో పైలెట్ వెంటనే రైలును ఆపేశాడు. గాయపడిన నల్లమ్మను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

బాలుడిపై పోక్సో కేసు నమోదు

అనంతపురం: మూడేళ్ల చిన్నారిపై అసభ్యంగా ప్రవర్తించిన బాలుడిపై పోక్సో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం నగర శివారులోని ఓ కాలనీకి చెందిన దంపతులు భవన నిర్మాణ కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. రోజూ తమ మూడేళ్ల వయసున్న చిన్నారిని కూడా పని ప్రాంతానికి తీసుకెళ్లేవారు. ఈ క్రమంలో పని ప్రాంతం వద్ద చిన్నారి ఆడుకుంటూ ఉండగా ఓ మైనర్ బాలుడు చాక్లెట్ ఆశ చూపి తన వెంట భవనం పక్కకు తీసుకెళ్లి అఘాయిత్యం చేయబోయాడు. అదే సమయంలో పాప కనిపించడం లేదని వెతుకుతూ భవనం కిందకు చేరుకున్న తల్లిదండ్రులకు సమీపంలోని నిర్జన ప్రదేశం నుంచి ఏడుపు వినిపించింది. వెంటనే వారు అక్కడకు చేరుకుని పాపను కాపాడారు. మైనర్ బాలుడి అసభ్య ప్రవర్తనపై మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి బాలుర పరివర్తనా కేంద్రానికి తరలించారు.

క్లుప్తంగా

సింగంపల్లిలో ముగిసిన మొహర్రం



సింగంపల్లిలో జలధికి తరలుతున్న పీర్లు

ఆత్మకూరు: మండలంలోని సింగంపల్లి గ్రామంలో బుధవారం మొహర్రం వేడుకలు ముగిశాయి. తెల్లవారుజామున పీర్లకు గ్రామోత్సవం నిర్వహించారు. అదేవిధంగా మొక్కుబడి ఉన్న భక్తులు చెట్లను కొట్టి గుండంలో వేశారు. హిందువులు, ముస్లింలు కలిసి పండుగను జరుపుకున్నారు. సాయంత్రం పీర్లను జలధికి తరలించారు. అంతకుముందు యువత ఆలయ గుండం చుట్టూ దప్పుచప్పుళ్ల మధ్య అలావ్ తొక్కుతూ సందడి చేశారు.

31న ఆలయ భూముల వేలం

అనంతపురం కల్చరల్: అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లి గ్రామంలో వెలసిన ఆంజనేయ స్వామి, చెన్నకేశవ స్వామి దేవస్థానాలకు చెందిన దేవుడి మాన్యాన్ని కౌలుకు ఇచ్చేందుకు ఈనెల 31న వేలం నిర్వహిస్తున్నట్లు పాతూరు రామస్వామి ఆలయ ఈఓ రామాంజనేయులు బుధవారం తెలిపారు. మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయంలో వేలం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనాలని సూచించారు.

బాధ్యతగా పని చేయండి



మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీఎస్ మూర్తి

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ పరిపాలన విభాగంలోని వివిధ సెక్షన్లను మునిసిపల్ ఆర్డీ, నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీఎస్ మూర్తి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ కార్యాలయంలో అందుబాటులో ఉండాలన్నారు. సాకులు చెప్పి తప్పించుకుని తిరిగితే ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేసి నగరపాలక సంస్థకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రజలతో మర్యాదగా మాట్లాడాలన్నారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ శ్రీహరిబాబు తదితరులు ఉన్నారు.

యువకుడిపై లాఠీచార్జ్

అనంతపురం: రెండు రోజుల క్రితం అనంతపురంలోని శ్రీకంఠం సర్కిల్‌లో రాత్రి 10 గంటలకు రోడ్డుపై ఇద్దరు స్నేహితులు మాట్లాడుతుండగా సీఐ వాహనం వద్దకు పిలిచి లాఠీచార్జ్ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సోషల్ మీడియాలో ఈ అంశం వైరల్‌గా మారింది. కొట్టకండి సార్ అని వేడుకున్నా వదిలిపెట్టకుండా సీఐ చితకబాదారు. లాఠీచార్జ్ చేసిన సీఐ ఎవరు అనే అంశంపై పోలీసు విభాగంలో చర్చ మొదలైంది. బాధితుడు ఫిర్యాదు చేస్తే సంబంధిత సీఐపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

ఆఫీస్ నిర్వహణపై గురుకులాల సిబ్బందికి శిక్షణ



మాట్లాడుతున్న రిసోర్స్‌పర్సన్ రమేష్

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని సాంఘిక సంక్షేమ (అంబేడ్కర్) గురుకులాల్లో పని చేస్తున్న నాన్ టీచింగ్, మినిస్టీరియల్ స్టాఫ్‌కు బుధవారం బి.పప్పూరు గురుకుల పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డిస్ట్రిక్ట్ ఆఫీస్ మ్యాన్యువల్, పెన్షన్ రూల్స్, లీవ్ రూల్స్, ఫైనాన్షియల్ కోడ్, ఆఫీస్ నిర్వహణ తదితర అంశాలపై రిసోర్స్‌పర్సన్ రమేష్ అవగాహన కల్పించారు. అంతకుముందు అంబేడ్కర్ గురుకుల పాఠశాలల జిల్లా కో–ఆర్డినేటర్ అంగడి మురళీ కృష్ణ శిక్షణను ప్రారంభించారు. ఇలాంటి శిక్షణ ఉద్యోగులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. శిక్షణ అంశాలను సద్వినియోగం చేసుకుని కార్యాలయాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పప్పూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, ఉమ్మడి జిల్లాలోని 16 సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉద్యోగిపై చీటింగ్ కేసు నమోదు

అనంతపురం: విద్యుత్‌శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రామాంజనేయులుపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు అనంతపురం వన్‌టౌన్ సీఐ వి.రెడ్డప్ప తెలిపారు. చీటీల పేరుతో సుమారు రూ.2 కోట్ల వరకూ తోటి ఉద్యోగులు, నగరానికి చెందిన ప్రజలను మోసం చేశారన్నారు. చీటీ గడువు అయిపోయినప్పటికీ, మొత్తం ఇవ్వడానికి నిరాకరిస్తూ ఇదిగో ఇస్తా.. అదిగో ఇస్తా కాలయాపన చేశారు. రామాంజనేయులు వైఖరితో విసిగిపోయిన పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

‘హరిత అనంత’ సాధ్యమయ్యేనా?

- నగరంలో మొదటి దశలో 3 వేల మొక్కలు నాటేందుకు ప్రణాళిక
- రూ.4.75 లక్షలతో మొక్కల కొనుగోలుకు టెండర్లు
- ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటిన అధికారులు, ప్రజా ప్రతినిధులు
- ప్రశ్నార్థకంగా మారిన నిర్వహణ



నగరంలోని డివైడర్ మధ్యలో మొక్కలు నాటిస్తున్న ఏడీఏ లక్ష్మీప్రసన్న

అనంతపురం కార్పొరేషన్: నగరంలో ‘హరిత అనంత’ సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. ‘హరిత అనంత’ లక్ష్యంగా జిల్లా కలెక్టర్ నగరపాలక సంస్థ పరిధిలో విరివిగా మొక్కలు నాటాలని ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా ఇటీవల నగరంలోని వివిధ ప్రాంతాల్లో స్వయంగా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ప్రజా ప్రతినిధులు మొక్కలు నాటారు. మొక్కలు నాటారు సరే.. వాటి సంరక్షణే ప్రశ్నార్థకంగా మారుతోంది. నగరపాలక సంస్థ అధికారులు ముందుచూపుతో వాటిని పరిరక్షించేందుకు చర్యలు చేపడితే హరిత అనంత లక్ష్యంగా సాధ్యం అవుతుంది. లేకపోతే ప్రశ్నార్థకంగా మారుతుందని నగరపాలక సంస్థ వర్గాలు చెబుతున్నాయి.

3 వేల మొక్కలు నాటేలా..

హరిత అనంత కార్యక్రమంలో భాగంగా మొదటి దశలో నగరంలోని ప్రధాన రోడ్లు, కొన్ని పార్కుల్లో మొక్కలు నాటాలని నగరపాలక సంస్థ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. నగరంలోని రాంనగర్ 80 ఫీట్ రోడ్డు, జేఎన్‌టీయూ రోడ్డు, ఆర్‌టీఓ ఆఫీస్ రోడ్డు, హౌసింగ్ బోర్డు కాలనీ, గౌరవ గార్డెన్స్, లెక్చరర్స్ కాలనీ, మారుతీనగర్ ఎక్స్‌టెన్షన్, ఆర్కే నగర్, ఇందిరా నగర్, లక్ష్మీనగర్ మెయిన్ రోడ్డు, అరుణోదయకాలనీ, సాయినగర్, స్మార్ట్ సిటీ రోడ్డు తదితర ప్రాంతాల్లో 2020 స్పతోడియా, తెబుబియా రోసియా, మిచెల్లా చంపాక, మిల్లిగ్టోనియా హర్టెన్సిస్, బాదమ్, లాగర్‌స్టోర్‌మియా, బౌనియా పర్పురియా, జకారడ మిమోసిఫోల్లా, మహాగోని, కాసియాఫిస్టులా, టికోమా, తదితర మొక్కలు నాటాలని నిర్దేశించుకున్నారు. ఇందుకోసం రూ.4.75 లక్షలతో టెండర్లను ఆహ్వానించారు. ఇప్పటికే ఫారెస్ట్ అధికారుల నుంచి 1000 మొక్కలను నగరపాలక సంస్థ అధికారులు తీసుకుని వివిధ ప్రాంతాల్లో నాటుతున్నారు. ఇటీవల కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ మొక్కలు నాటి, వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పూర్తిస్థాయిలో సిబ్బంది కొరత

ప్రస్తుతం మొక్కలు నాటే కార్యక్రమానికి, వాటి పరిరక్షణకు పూర్తి స్థాయిలో సిబ్బంది లేరు. కేవలం వీటి నిర్వహణకు 9 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. రెగ్యులర్‌గా మొక్కలను నాటడంతో పాటు వాటిని పరిరక్షించేందుకు ట్రీ గార్డ్స్ తదితర వాటిని ఏర్పాటు చేయాల్సి ఉంది. రోజూ నీరు అందించేలా చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకుంటున్నా.. పూర్తిస్థాయిలో నిర్వహణ ఉంటే మొక్కల సంరక్షణ సాధ్యపడుతుంది.

చర్యలు తీసుకుంటాం..

మొక్కల సంరక్షణకు అధికారులతో కలసి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నగరంలోని ట్యాంక్ బండ్, రాంనగర్, జూనియర్ కళాశాల, బుద్ధవిహార్ పార్క్ తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటడం జరిగింది. మొక్కలకు రెగ్యులర్‌గా నీరు అందించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించాం. త్వరలో మరిన్ని మొక్కలను కొనుగోలు చేసి, అధికారుల ఆదేశాల మేరకు విరివిగా నాటేందుకు చర్యలు తీసుకుంటాం

– లక్ష్మీప్రసన్న ఏడీఏ, నగరపాలక సంస్థ

నవయుగ వైతాళికుడు జాషువా



సాహిత్యపీఠం ఆధ్వర్యంలో జాషువాకు నివాళి

అనంతపురం కల్చరల్: నవయుగ వైతాళికుడుగా సమసమాజ నిర్మాణం జరగాలని భావించిన మహాకవి జాషువా అని పలువురు రచయితలు, కవులు పేర్కొన్నారు. గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా బుధవారం పలువురు రచయితలు, కళాకారులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. జాషువా సాహిత్య పీఠం నాగలింగయ్య ఆధ్వర్యంలో నినాదాలు చేస్తూ జాషువా గొప్పతనాన్ని కొనియాడారు. అనంతరం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో జరిగిన సాహితీ సదస్సుకు ఆచార్య బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. ఆత్మీయ అతిథిగా మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్, జనప్రియ కవి ఏలూరు యంగన్న, ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ దివాకరరెడ్డి, డాక్టర్ జగర్లపూడి శ్యామసుందర శాస్త్రి, హెచ్.నాగలింగయ్య, డాక్టర్ నానీల నాగేంద్ర, డాక్టర్ అంకే శ్రీనివాస్, సుబ్బయ్య తదితరులు హాజరై మాట్లాడారు. జాషువా సాహిత్యం విశ్వజనీనమైనదని.. పామర పండితులకు సరళంగా అర్థమయ్యే భాషలో రాసిన కవులు అరుదుగా ఉంటారన్నారు. ఆయన రాసిన గబ్బిలం, ఫిరదౌసి, బాపూజీ, కాందిశీకుడు మొదలైన కావ్యాలు వేటికవే తెలుగు సాహిత్య గొప్పతనాన్ని జాతీయస్థాయిలో చాటాయని గుర్తు చేశారు. వర్గ సమాజం పోవాలని కుల రహిత సమాజం కోసం పాటుపడిన జాషువా సాహిత్యాన్ని మరింత విస్తృతం చేయాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పూజారి ఈరన్న, టీవీ రెడ్డి, యోగేశ్వర నాయుడు, రియాజుద్దీన్, రామచంద్ర, బీసీ లక్ష్మణ్ణ, అశ్వర్థ రెడ్డి, ప్రజాగాయకుడు దాసరి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొర్రీలు లేకుండా అమలు చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఏడీపీఎస్‌ఏ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ‘తల్లికి వందనం’ పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు వర్తింపజేస్తామని మంత్రి నారా లోకేష్ ప్రకటనపై అనంతపురం జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (ఏడీపీఎస్‌ఏ) నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం నగరంలోని సంఘం కార్యాలయంలో అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఎంతమంది పిల్లలున్నా ఈ పథకాన్ని వర్తింపజేస్తామని మంత్రి స్పష్టత ఇచ్చారన్నారు. ఎలాంటి కొర్రీలు లేకుండా పూర్తిస్థాయిలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఏడీపీఎస్‌ఏ వ్యవస్థాపక సీఆర్‌ఓ కోటిరెడ్డి రవిచంద్ర రెడ్డి, గౌరవ సలహాదారు కె.రామాంజనేయులు, గౌరవ అధ్యక్షులు జి. గంగాధర యాదవ్, అధ్యక్షులు గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. రమణారెడ్డి, కోశాధికారి సి.రామచంద్ర, ఉపాధ్యక్షులు ఎస్.రాఘవేంద్ర, నగర గౌరవ అధ్యక్షుడు ఎం.చంద్రశేకర్ రెడ్డి, నగర అధ్యక్షుడు జి.భాస్కర్ రెడ్డి, కోశాధికారి పి.వేణు మనోహర్, సభ్యులు జానకి రాములు, విజయ్ కుమార్, రఫి, సోమశేఖర్, వినోద్ కుమార్ రెడ్డి, శ్రీ వత్స కుమార్, మద్దయ్య, కేవీ నారాయణ పాల్గొన్నారు.

పాఠశాలల్లో క్రీడా పోటీలు



ఆత్మకూరు: హాకీలో తలపడుతున్న విద్యార్థులు



బహుమతులు అందజేస్తున్న అధికారులు

ఆత్మకూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఖోఖో, హాకీ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజనేయులు మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలు పెట్టాలన్నారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందన్నారు. శారీరక ధారుడ్యం పెరుగుతందని పేర్కొన్నారు.

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా క్రీడా పోటీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు మున్వర్‌భాషా, ప్రసూన్‌కుమార్ నాయుడు, పాఠశాల హెచ్‌ఎం విజయనిర్మల, ఉపాధ్యాయురాలు శ్వేత తదితరులు పాల్గొన్నారు.



కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం ఢిల్లీలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.

– అనంతపురం కార్పొరేషన్:

రికార్డులు సరిగా భద్రపరుచుకోండి



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటశివారెడ్డి

కనగానపల్లి: ప్రభుత్వ కార్యాలయాల్లోని రెవెన్యూ రికార్డులను సరిగా భద్రపరుచుకోవాలని ధర్మవరం ఆర్డీఓ వెంకటశివారెడ్డి రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. స్థానిక రెవెన్యూ సమస్యలపై సిబ్బందితో చర్చించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ.. రైతుల భూములు, ఇతర ఆస్తులకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను కార్యాలయంలో సక్రమంగా భద్రపరుచుకోవాలని మండల రెవెన్యూ అధికారులకు సూచించారు. ఈ రికార్డులు ఎటువంటి అగ్ని ప్రమాదాలకు, చోరీలకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. భూముల ఆన్‌లైన్ నమోదు, రైతుల భూ తగాదాలపై వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిష్కారం కాని సమస్యలు ఏవైనా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని రావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, సీఎస్‌డీటీ కవిత, సీనియర్ అసిస్టెంట్ దేవిపుత్ర, ఆర్‌ఐ సరళ, పలువురు వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

‘కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం’

రాప్తాడురూరల్: ప్రధానమంత్రి మోదీ కళ్లలో ఆనందం కోసం కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెట్టిందని అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ ఆరోపించారు. బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. రూ.48 లక్షల కోట్ల బడ్జెట్‌లో కనీసం రూ.1000 కోట్లు కూడా రాష్ట్రానికి గ్రాంట్ ప్రకటించక పోవడం కూటమి వైఫల్యమే అన్నారు. మోదీ ప్రభుత్వం బీహార్, ఆంధ్ర రాష్ట్రాల మద్దతుతోనే నడుస్తోందన్నారు. బీహార్ రాష్ట్రానికి బడ్జెట్‌లో అగ్ర తాంబూలం ఇచ్చి రూ.60 వేల కోట్ల గ్రాంట్ కేటాయించారన్నారు. విభజనతో కుదేలైన మన రాష్ట్రానికి, చంద్రబాబు కలలుగన్న ప్రపంచస్థాయి అమరావతి రాజధాని నిర్మాణానికి కేవలం రూ.15 వేల కోట్లు సహకారం అందిస్తామన్నారే గాని గ్రాంట్ ప్రకటించలేదన్నారు. ఆ మొత్తం ప్రపంచ బ్యాంక్ లేదా ఏషియన్ బ్యాంక్ లాంటి సంస్థలతో అప్పు ఇప్పించడమే అన్నారు. ఆ మొత్తం వడ్డీతో సహా రాష్ట్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. విశాఖ, మెద్రాస్ ఇండస్ట్రియల్ కారిడార్‌కు సహకరిస్తామన్నారే కానీ బడ్జెట్ కేటాయింపులు లేవని గుర్తు చేశారు. గతంలో తాను ఎన్డీఏతో విడిపోయి రాజకీయంగా తప్పు చేశానని భవిష్యత్తులో ఎలాంటి విపత్తు వచ్చినా ఎన్డీఏను వదిలిపోనని చంద్రబాబు ఖరాకండిగా చెప్పారన్నారు. స్కిల్ అవినీతి కేసు నుంచి తప్పించుకోవడంతో పాటు రాష్ట్రంలో విశ్వసనీయత లేక సొంత బలాన్ని కోల్పోయి జనసేన బీజేపీపై పూర్తిగా ఆధారపడ్డారన్నారు. అందుకే ఇంత అనుకూల పరిస్థితిలో కూడా రాష్ట్రానికి అన్యాయం జరిగిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలో కూటమి సొంత ప్రయోజనాలను పక్కనపెట్టి అన్ని పార్టీలను కలుపుకుని కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్యకర జీవనానికి యోగా అవసరం



గురువులను సత్కరించిన యోగా కేంద్రం నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: ఒత్తిడితో నిండిన జీవనానికి యోగా అవసరమని వివేకానంద యోగ కేంద్రం అధ్యక్షుడు మెళవాయి రాజశేఖరరెడ్డి అన్నారు. రెండు దశాబ్దాలుగా పలు కేంద్రాల్లో ఉచిత యోగా శిక్షణ అందిస్తున్న యోగా గురువులను బుధవారం స్థానిక శివాలయంలో సత్కరించారు. రాజశేఖరరెడ్డి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో యోగా గురువులు మారుతీప్రసాద్, జయకర్, దివాకర్, ఆంజనేయులు తదితరులు యోగాతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలో అందిస్తున్న ఉచిత యోగా వివరాలను తెలియజేశారు. మొదటి రోడ్డు శివాలయం, ఆర్ట్స్ కాలేజ్, అశోక్ నగర్ శ్రీసరస్వతీ విద్యామందిరం, జెడ్పీ ప్రాంగణం, రాంనగర్‌లోని కమ్మభవన్, షిర్డీ నగర్‌లోని యోగా కమ్యూనిటీ హాల్ తదితర చోట్ల రోజూ 5:30 గంటలకు, సాయంత్రం 5 గంటలకు కమ్మభవన్‌లో మహిళలకు స్థానిక విద్యారణ్య ఓరియంటల్ స్కూల్, ఆజాద్‌నగర్‌లో ఉచిత యోగా నేర్పిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తారకరామయ్య, పుల్లయ్య, శ్రీనివాసులు, సుశీల, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకోండి

అనంతపురం కార్పొరేషన్: నగరంలో పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మునిసిపల్ ఆర్డీ, నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీఎస్ మూర్తి ఆదేశించారు. బుధవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. చెరువుకట్ట వద్ద ఉన్న ఎన్టీఆర్ పార్క్‌లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడాన్ని చూసి అసహనం వ్యక్తం చేశారు. పార్క్‌ను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నడిమివంకను పరిశీలించారు. నీరు నిల్వ ఉండకుండా సజావుగా వెళ్లేలా పూడికతీత పనులను చేపట్టాలని ఇంజినీర్లను ఆదేశించారు.

యువకుడికి తీవ్ర గాయాలు

అనంతపురం: నగర శివారులోని జాతీయ రహదారిపై ఉన్న కేఎఫ్‌సీ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పామిడి మండలం వంకరాజు కాలువ గ్రామానికి చెందిన అనిల్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. అనిల్ తన ద్విచక్ర వాహనాన్ని యూటర్న్ చేసుకుంటుండగా.. వెనుక వైపు నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో అనిల్ తీవ్రంగా గాయపడ్డాడు.

గ్రంథాలయ పితామహుడికి నివాళి



వెంకట రమణయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కనగానపల్లి: గ్రంథాలయ పితామహుడు, పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్యకు పలువురు నివాళులు అర్పించారు. స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో బుధవారం గ్రంథాలయ పితామహుడు వెంకరమణయ్య జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి గోవిందు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సేవలను కొనియాడారు. గ్రంథాలయ ఉద్యమానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

ఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

అనంతపురం ఎడ్యుకేషన్: రాయలసీమ విద్యార్థి యువజన సంఘం (ఆర్‌ఎస్‌వైఎఫ్) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బుధవారం నగరంలోని జరిగిన సమావేశానికి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్ కుమార్ హాజరయ్యారు. ఆయన అధ్యక్షతన సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా కురుబ భీమేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శాంతరాజు, కార్యవర్గ సభ్యులుగా అజయ్, వంశీ, బాషా, శీను, ముత్తు, సాదిక్, రవి, జగదీష్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న టింబక్ట్ కలెక్టివ్ సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ఒంటికొండ గ్రామంలో బుధవారం టింబక్ట్ కలెక్టివ్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతిభా సొసైటీ మేనేజర్ జయశ్రీ, సొసైటీ సభ్యులు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి ఉన్న చట్టాలను వివరించారు. బాల్య వివాహాల నివారణకు అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం నాటిక ద్వారా చట్టాలపై ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా ప్రదర్శించారు. కార్యక్రమంలో మిశిత సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి



మోదకాల అలంకారంలో వినాయకుడు

అనంతపురం కల్చరల్: స్థానిక మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయం, చెరువుకట్ట, రాంనగర్‌లోని కమ్మభవన్, రజక నగర్‌లోని సంకష్టహర వినాయక ఆలయం, రైల్వేస్టేషన్ సమీపంలోని సిద్ధి గణపతి ఆలయం తదితర చోట్ల బుధవారం సంకష్టహర చతుర్థి వ్రతాలు ఘనంగా జరిగాయి. వినాయకుడిని 108 కుడుములతో అలంకరించి ఆరాధించారు. వేదపండితులు వ్రతకథలు చెపుతుంటే బారులు తీరి భక్తులు భక్తిశ్రద్ధలతో వినాయక ప్రతిమకు పూజలు చేశారు. నియమనిష్ఠలతో చేసిన ఉపవాస దీక్షను ముగించారు. అనంతరం కుడుములను నైవేద్యం చేసి భక్తులకు వితరణ చేశారు. మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం జరిగాయి.

రోడ్డుపై చెత్త వేయొద్దు



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ శ్రీహరిబాబు

అనంతపురం కార్పొరేషన్: ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా, నగరపాలక సంస్థ సిబ్బందికి అందించేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత సచివాలయ పారిశుధ్య కార్యదర్శులపై ఉందని అదనపు కమిషనర్ శ్రీహరిబాబు తెలిపారు. మునిసిపల్ ఆర్డీ పీవీవీఎస్ మూర్తి ఆదేశాల మేరకు బుధవారం నగరంలోని అరవింద నగర్, నాయక్‌నగర్, మారుతీనగర్, సంఘమిత్ర కాలనీ, సూర్యనగర్, సున్నపు వీధి, ఉమానగర్, తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. చెత్త సేకరణ, తరలింపు నిర్దేశిత సమయంలో చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు సైతం చెత్తను నగరపాలక సంస్థ సిబ్బందికి అందించాలన్నారు. ప్రజారోగ్యాన్ని కాపాడటంలో భాగస్వాములు కావాలన్నారు.